# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 29 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 277

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?

"ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారు" అని రేవంత్ హెచ్చరించారు.



- నేను సిఎం అయిన రెండోరోజే గుండెపగిలిన కెసిఆర్
- అక్కసు వెళ్లగక్కేలా కెసిఆర్ ఎల్కతుర్తి ప్రసంగం
- బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- ఎమ్మెల్యేలదే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత
- నమ్ముకున్న వారికే పదువులు వస్తాయి
- జానారెడ్డి నివాసంలో సిఎం రేవంత్ చర్చలు



హైదరాబాద్: తాను సీఎం అయినా రెండో రోజే కేసీఆర్ గుండె పగిలిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో గులాబీ బాస్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రసంగంలో పసలేదని.. ప్రభుత్వంపై ఆయన అక్కసంతా వెళ్లగక్కారని విమర్శించారు. కేసీఆర్ పదేళ్లలో రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. కేసీఆర్ ఎన్ని చెప్పినా.. బీఆర్ఎస్
ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారన్నారు. కేసీఆర్ ప్రసంగంలో స్పష్టతే లేదన్నారు. మా పిల్లలనే అసెంబ్లీలో ఎదుర్కొలేక పోతున్నారని కేసీఆర్ అంటున్నారు.. వాళ్ళు పిల్లలు అని తెలిశాక మరీ అసెంబ్లీకి ఎందుకు పంపిస్తున్నారని కౌంటర్ ఇచ్చారు. మేం కక్ష సాధింపు చర్యలకు దిగమని.. తాను ఇంకో 20 ఏండ్లు రాజకీయాల్లో ఉంటానని తెలిపారు. కేటీఆర్ కేసు అయినా.. ఫోన్ ట్యాపింగ్ కేసు అయినా చట్టపరంగానే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ మాదిరిగా చట్టానికి వ్యతిరేకంగా కేసులు పెట్టి జైల్లో వేయించమన్నారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులపై డిమాండ్లు వస్తున్నాయని.. కానీ చట్టప్రకారమే నడుచుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర పథకాల ప్లానింగ్ కే సరిపోయిందని.. ఇకపై పథకాల గ్రౌండింగ్ పై ఫోకస్ పెడతామని చెప్పారు. కేసీఆర్ మాదిరిగా లాంఛింగ్.. క్లోజింగ్ స్కీములు ఉండవని.. ఏదైనా ఒక పథకం ప్రారంభిస్తే అర్హులకు అందేవరకు పని చేస్తానని అన్నారు. రేవంత్ రెడ్డి చెప్పింది చేస్తాడు అనే నమ్మకం కలిగేలా పని చేస్తానని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. 'కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. భారాసను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్

మిగతా 2లో




2లో..

## గ్రూప్-1 స్టేపై టీజీపీఎస్సీ అప్పీల్




2లో..

## సిఎం రేవంత్ భయానికే అసెంబ్లీకి కెసిఆర్ డుమ్మా

కాంగ్రెస్‌ను పొగిడి..ఇప్పుడు విమర్శలా

మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



2లో..

## తెలంగాణ ఇచ్చిన సోనియాను దేవత అనలేదా

- తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని ఎలా అంటారు
- అక్రమంగా పదిలక్షల కోట్లు సంపాదించినకెసిఆర్
- కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు ఉత్తమ్,కెమటిరెడ్డి



2లో..

## సిఎస్‌గా రామకృష్ణారావు నియామకం

# మెరిసిన తెలుగు ప్రతిభా పద్మాలు



దిల్లీ: ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల తొలి విడత ప్రదానోత్సవం దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మొత్తం నలుగురికి పద్మ విభూషణ్, 10 మందికి పద్మ భూషణ్, 57 మందికి పద్మశ్రీలు ప్రదానం చేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులతోపాటు ఇతర కేంద్రమంత్రులు, ప్రముఖులు అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా తెలుగు రాష్ట్రాలకు చెందిన జీర్ణకోశ వ్యాధుల ప్రముఖ వైద్య నిపుణుడు డి. నాగేశ్వరరెడ్డి పద్మవిభూషణ్, ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలు పద్మభూషణ్ పురస్కారాలు స్వీకరించారు. మరణానంతరం పద్మశ్రీకి ఎంపికైన బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావు తరఫున ఆయన కుమార్తె యఱ్ఱవల్లి శ్రీదేవి, అవధాని మాడుగుల నాగఫణిశర్మ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు.కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించగా అందులో 71 మందికి సోమవారం జరిగిన తొలి విడత కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో ప్రఖ్యాత సంగీత కళాకారుడు లక్ష్మీనారాయణ సుబ్రహ్మణ్యం, ఒసాము సుజుకీ (మరణానంతరం) పద్మ విభూషణ్, ప్రముఖ బహుభాషా నటుడు అజిత్ కుమార్ పద్మ భూషణ్ పురస్కారాలు అందుకున్నారు. మిగిలిన 68 మందికి త్వరలో జరిగే రెండో విడత కార్యక్రమంలో ఈ పురస్కారాలు అందిస్తారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి బాలకృష్ణ సోదరి, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, బాలకృష్ణ చిన్నకుమార్తె తేజశ్విని, అల్లుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, కుమారుడు మోక్షజ్ఞ తదితరులు హాజరయ్యారు. మిగిలిన అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సంతోషాన్ని పంచుకున్నారు.మిర్యాల అప్పారావు (మరణానంతరం) తరఫున పద్మశ్రీ పురస్కారం స్వీకరిస్తున్న ఆయన కుమార్తె యఱ్రవల్లి శ్రీదేవిబాలకృష్ణ మరిన్ని నూతన శిఖరాలు అధిరోహించాలిరాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారం అందుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయన్ను అభినందించారు. "కళలు, సేవా, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన బాలయ్య మరిన్ని నూతన శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నందమూరి బాలకృష్ణకు ప్రత్యేక స్థానం ఉందని, చారిత్రక, పౌరాణిక, జానపద పాత్రల్లో ఆయన

శైలి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

బాలకృష్ణ పద్మ భూషణ్ పురస్కారం స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పద్మ భూషణ్ పురస్కారం స్వీకరించిన ప్రముఖ కథానాయకుడు అజిత్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు.పద్మ అవార్డులు అందుకున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి, బాలకృష్ణ, మాడుగుల నాగఫణి శర్మలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు.



### ప్రభుత్వ అరాచకాలను మరింతగా

# ఎండగడతాం

**రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలను, అన్యాయాలను రానున్న రోజుల్లో మరింతగా ఎండగడతామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. భారాస రజతోత్సవ సభను విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలను, అన్యాయాలను రానున్న రోజుల్లో మరింతగా ఎండగడతామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. భారాస రజతోత్సవ సభను విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకులతో కేటీఆర్ సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "లక్షల సంఖ్యలో ప్రజలు సభకు హాజరై, కేసీఆర్ నాయకత్వం పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారు. ఎల్కతుర్తి సభ ద్వారా భారాస మరోసారి అధికారంలోకి రాబోతోందని స్పష్టమైంది. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద బహిరంగ సభల్లో ఒకటిగా ఈ రజతోత్సవ సభ నిలిచిపోతుంది. ట్రాఫిక్ నిర్వహణలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం విఫలమైనప్పటికీ.. లక్షల మంది ముందే సభాప్రాంగణానికి చేరుకోవడం.. తెలంగాణ ప్రజల నిబద్ధతకు నిదర్శనం. ఈ భారీ బహిరంగ సభను పక్కా ప్రణాళికతో, ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతం చేయగలిగాం. ఈ సభ రజతోత్సవ కార్యక్రమాలకు కేవలం ప్రారంభం మాత్రమే. భవిష్యత్తులో మరిన్ని ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి. ప్రజలను చైతన్యపరిచేలా, ప్రభుత్వ వైఫల్యాలను, దోపిడీ చర్యలను మీడియా ద్వారా ఎండగట్టాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు. కేటీఆర్‌కు స్వల్ప గాయం తాను జిమ్‌లో వర్కవుట్ చేసే క్రమంలో వెన్నుపూసలో డిస్క్‌కు స్వల్పంగా గాయమైనట్లు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. 'ఎక్స్'లో సోమవారం ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. "డిస్క్ గాయమైంది. వైద్యులు కొద్దిరోజులు బెడ్‌రెస్ట్ తీసుకోవాలని సలహా ఇచ్చారు. తద్వారా త్వరగా కోలుకోవడానికి వీలవుతుందని చెప్పారు. త్వరలో పూర్తి ఆరోగ్యంతో మీ ముందుకు వస్తాను" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల వేట

**పాక్ గుండెల్లో గుబులు.. ఉగ్రవాదులను తరలిస్తున్న దాయాది సైన్యం? పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు నిఘావర్గాల సమాచారం.**

- నలుగురు ముష్కరులు నక్కిన స్థావరాల గుర్తింపు
- దొరికినట్లే దొరికి తప్పించుకుంటున్న ఉగ్రవాదులు
- ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలు లేపేస్తున్న పాక్



2లో..

# పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయాం

- కాశ్మీర్ అసెంబ్లీలో సిఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలు
- మృతులకు ఘనంగా నివాళి అర్పించిన అసెంబ్లీ

**పహల్గాం దాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ, బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే.**



2లో..

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

## గ్రూప్-1 స్టేపై టీజీపీఎస్సీ అప్పీల్

హైదరాబాద్: గ్రూప్–1 అభ్యర్థుల నియామకంపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో అంశంపై టీజీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రూప్–1 పరీక్షపై టీజీపీఎస్సీ అప్పీల్ దాఖలు చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరగనుంది. హైకోర్టు ఉత్తర్వులతో తెలంగాణలో గ్రూప్ 1న నియామకాలు సందిగ్ధంలో పడ్డాయి. గ్రూప్1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. 19మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఒక నిరుద్యోగ అభ్యర్థి పరీక్షల్లో అక్రమాలపై హైకోర్టును ఆశ్రయించారు. రెండు సెంటర్లలో పరీక్షలు రాసిన వారే ఎక్కువగా ఎంపిక కావడంపై 20మంది అభ్యర్థులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ గ్రూప్ 1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరపాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. వారికి నియామక పత్రాలను మాత్రం తుది తీర్పు తర్వాత అందించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై టీ–జీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది.

## సిఎం రేవంత్ భయానికే అసెంబ్లీకి కెసిఆర్ డుమ్మా

సంగారెడ్డి: గాంధీ కుటుంబంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి తిప్పికొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి భయానికే కేసీఆర్ అసెంబ్లీకి పోవడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్‌ను కడిగేస్తాడు అని భయం పట్టుకుందన్నారు. అది తప్పించు కోవడానికి అసెంబ్లీకి పోవడం లేదన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అంటే నాకు గౌరవం. పరిపూర్ణత చెందిన నాయకుడి అని నేను భావిస్తా. కేసీఆర్ పదేళ్లు సీఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులు అని జగ్గారెడ్డి అన్నారు. కానీ..
రేవంత్, కేసీఆర్ సభలో ఎదురు పడండి తెలంగాణ శాసనసభ ఎట్లా ఉంటాదో చూద్దాని సవాల్ విసిరారు. నిన్న రజతోత్సవ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. గాంధీ కుటు–ంబం కోసం నెలలు నెలలు వెయిట్ చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చే వరకు గాంధీ కుటు–ంబం హీరో అని కొనియాడారు. తెలంగాణ ఇచ్చిన తర్వాత డబ్లికేట్ గాంధీలు అయ్యారా? అని ప్రశ్నించారు. ప్రజల పట్ల కాంగ్రెస్ హీరో అని.. ప్రతిపక్షానికి విలన్ అన్నారు. బీఆర్ఎస్ ఉనికి కాపాడుకునే పనిలో సభలో జరిగిందన్నారు.. కేసీఆర్ పదేళ్లు సీఎంగా పని చేశారు... చాలా అనుభవజ్ఞులని జగ్గారెడ్డి అన్నారు. ఇప్పుడు గతాన్ని మర్చిపోయి మాట్లాడారని.. డుబ్లికెట్ గాంధీలు అనడం ఆశ్చర్యం అనిపించిందని జగ్గారెడ్డి చెప్పారు. కేసీఆర్ తెలంగాణ నినాదం నుంచి వెనక్కి తగ్గాలని అనుకున్న సమయంలో ఆయన్ని లేపింది కాంగ్రెస్ నేతలే అని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజన జరగాలి అని మా పార్టీ నేతలే వెనక నిలబడి నడిపించారన్నారు. కాంగ్రెస్ నాయకత్వం వెనకాల లేకుంటే కేసీఆర్ దీక్ష జరిగేది కాదు.. ఇది వాస్తవం విమర్శ కోసం చెప్పడం లేదు. రాహుల్ గాంధీ పై కేసీఆర్ మాట జారాడు. మీ మాట పై మీకే విలువ లేదా..? సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు అని చెప్పింది నువ్వే కదా..? రాహుల్ గాంధీ తెలంగాణ ఇచ్చేయండి అని చెప్పిన తర్వాతే ... పక్రియ మొదలైంది. అప్పుడేమో.. రాహుల్..సోనియా గాంధీ దేవుళ్ళు అన్నావు. ఇప్పుడు కేసీఆర్ కడుపు నిండి ఉన్నది కాబట్టి దయ్యాలు అయ్యారా ఇవాళ. కేసీఆర్ అనవసరంగా మాట తూలుతున్నారు. నీ పార్టీకి నువ్వు ఎట్లా ప్రచారం చేశావో.. మా పార్టీకి రాహుల్ గాంధీ ప్రచారం చేశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పాలి. బేషరతుగా క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ అంటే నాకు గౌరవం. పరిపూర్ణత చెందిన నాయకుడి అని నేను భావిస్తా. కానీ ఈ వయసులో ఇంత దిగజారి మాట్లాడుడు అవసరమా..? ఎథిక్స్ తో రాజకీయాల్లో ఉన్న కుటుంబం కేవలం రాహుల్ గాంధీ కుటుంబమే. బ్రిటిష్ పాలన లో కూడా లక్షల కోట్లు– ఆస్తులు ధారాదత్తం చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం. బీఆర్ఎస్ ఢిల్లీకి సంచులు మోయలేదా..? ఢిల్లీ.. ఒరిస్సా.. పంజాబ్.. కర్ణాటక.. తమిళనాడు.. డబ్బులు పంపింది నువ్వు కాదా..? ఆరేడు రాష్ట్రాలకు సంచులు పంపింది కేసీఆర్ కాదా..?అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.

## తెలంగాణ ఇచ్చిన సోనియాను దేవత అనలేదా

నల్గొండ:తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ నే విమర్శిస్తావా అని కేసీఆర్ తీరును మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కమార్ రెడ్డిలు ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో 10 వేల అబద్దాలు ఆడారని వారు విర్శించారు. ఏ మోహం పెట్టుకుని కాంగ్రెస్ ను విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ దేవత అని కేసీఆర్ గతంలో అనలేదా అని ప్రశ్నించారు. సోనియా కాళ్లు మొక్కిన వ్యక్తి కేసీఆర్ అని కోమటిరెడ్డి అన్నారు. పదేండ్లలో కేసీఆర్ అక్రమంగా 10 లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అవినీతికి పాల్పడిన అధికారులు కొందరు జైల్లో ఉంటే మరి కొందరు అమెరికాలో ఉన్నారని విమర్శించారు. తాము అబద్దాలు చెప్పి ఉంటే ఎప్పుడో అధికారం లోకి వచ్చే వాళ్లమన్నారు. మేం తల్చుకుంటే బీఆర్ఎస్ కంటే తలదన్నే మీటింగ్ పెట్టగలమన్నారు. తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు– దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. మరో దశాబ్ధం నల్గొండ కాంగ్రెస్ దేనన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీపడబోమన్నారు. నల్గొండకు రూ. 700 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామనిచెప్పారు ఉత్తమ్. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు– కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటు–ప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్–2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమిషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది.

# పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయాం



**శ్రీనగర్:** పహల్గామ్ ఉగ్ర దాడిని ఖండిస్తూ జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ తీర్మానం చేసింది. మృతులకు ఘనంగా నివాళి అర్పించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర ప్రసంగం చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత దేశంలోని ప్రతి ప్రాంతం ఆవేదనకు గురైందన్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు.. తూర్పు నుంచి పడమర వరకు ఇలా ప్రతి ప్రాంతం దిగ్భ్రాంతికి గురైందని గుర్తుచేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ అంతా ఐక్యంగా ఉందని గుర్తుచేశారు. ఇక లోయలో ఉగ్రవాదం అంతం కావడం ఖాయమన్నారు. ఇక ఉగ్ర దాడిలో చనిపోయిన 26 మంది పేర్లను సభలో చదివి వినిపించారు. ఈ దాడిలో తండ్రులను కోల్పోయిన పిల్లలకు తాను ఏం సమాధానం చెప్పాలని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం బాధ్యతగా పర్యాటకులను ఆహ్వానించింది.. కానీ వారికి భద్రత కల్పించలేకపోయామన్నారు. క్షమాపణ చెప్పడానికి కూడా మాటలు రావడం లేదని.. తండ్రులను కోల్పోయిన పిల్లలకు గానీ.. భర్తలను కోల్పోయిన వితంతువులకు ఏం సమాధానం చెప్పాలన్నారు. తాము ఏం తప్పు చేశామని వాళ్లంతా అడుగుతున్నారని.. సమాధానం చెప్పలేకపోతున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అతిథులను కాపాడటంలో తాను విఫలమయ్యానని జమ్మూకశ్మీర్‌కు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. కానీ, ఆ 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను రాష్ట్రహోదాను డిమాండ్ చేయబోనని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు కాకుండా.. మరేదైనా రోజు లేవనెత్తుతానని చెప్పారు.
పహల్గాం దాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ, బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయిపహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టు–కొని రాష్ట్రహోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదు. గతంలో
రాష్ట్ర హోదా అడిగాము.. భవిష్యత్తులో కూడా అడుగుతాము. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటన్నారు. ప్రజలు మాకు మద్దతు ఇస్తే.. మిలిటెన్సీ, ఉగ్రవాదం అంతమవుతాయి. ఇది దానికి ఆరంభం. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదు. మేము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలం.. కానీ, మాకు ప్రజల మద్దతు అవసరం అని అబ్దుల్లా అసెంబ్లీలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటకశాఖ మంత్రిగా వారి కాపాడలేకపోయానన్నారు.
ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఈ క్రమంలో వారి మతం అడిగి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం సంచలనంగా మారింది.
ప్రభుత్వ చర్యలకు ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ ప్రశంసించారు. అలాగే ఉగ్రవాద దాడిని ఖండించారు. అఖిలపక్ష సమావేశాన్ని పిలిచినందుకు ముఖ్యమంత్రిని, ప్రత్యేక సమావేశాన్ని పిలిచినందుకు అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్‌ను ప్రశంసించారు.



## సిఎస్‌గా రామకృష్ణారావు నియామకం

### సిఎం రేవంత్‌ను కలిసిన కొత్త సిఎస్

### హెచ్ఆర్‌డి వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది. సీనియారిటీ– జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు– ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో రామకృష్ణారావు సోమవారం సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం ఆయనను అభినందించారు. ఇదిలావుంటే పదవీవిరమణ చేస్తున్న సీఎస్ శాంతి కుమారికి కీలక బాధ్యత అప్పగించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ) వైస్ ఛైర్‌పర్సన్ గా శాంతి కుమారి పేరును ప్రభుత్వం ప్రకటించింది. సీఎస్ పదవి విరమణ తర్వాత.. ఆమె ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.



## లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణం



రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్

## కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల వేట

శ్రీనగర్: ఓ వైపు పహల్గాం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట ముమ్మరంగా సాగుతోంది. మరోవైపు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను, పాక్ తరలిస్తోందని సమాచారం అందుతోంది. ఇక పహల్గామ్ నిందితుల్లో ఇప్పటికే ఆ నలుగురి లొకేషన్లను నాలుగుసార్లు ట్రాక్ చేయగా.. వారు త్రుటిలో తప్పించుకొన్నారు. ఒకసారి భద్రతా దళాలు.. ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకొన్నాయి. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో దళాలు పలు సందర్భాల్లో వారికి అత్యంత దగ్గరగా వచ్చాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా.. కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత చిక్కగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా.. ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉందని ఓ సైనిక అధికారి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహస్లీ వద్ద గుర్తించారు. కానీ, దళాలు అక్కడికి చేరేలోపు వారు చిక్కటి అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు– దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి
వారు జారుకొన్నాక కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టు–పక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని వారు పారిపోయినట్లు– సైనికాధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు తమకు అవసరమైన నిత్యావసరాల సేకరణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వీరు గ్రామాల సమీపంలోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే స్థానిక సహాయకులను సంప్రదించి అడవుల్లోకి ఆహారం తెప్పించుకొంటారు. ఆ సమయంలో దళాలకు హ్యూమన్ ఇం–టె–లిజెన్స్ లభిస్తుంది. కానీ వీరు చాలా అప్రమత్తంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఉగ్రవాదులు కిష్త్‌వార్ ప్రాంతంలోకి ప్రవేశిస్తే.. భద్రతా దళాలకు సమస్యలు రావొచ్చని భావిస్తున్నారు. ఇక్కడి పర్వతాలు పహల్గాం వైపు శిఖరాలతో కలిసి ఉంటాయి. తక్కువ మంచు ఉండటంతో.. ఉగ్రవాదులు అక్కడి నుంచి వారు చిక్కటి అడవులు ఉన్న జమ్మూ ప్రాంతంలోకి ప్రవేశించడానికి అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గాం చుట్టు–పక్కల అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదులు బైసరన్ లోయలో కొందరు సందర్శకుల నుంచి మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు. తమ వారితో మాట్లాడేందుకు వాటిని వాడొచ్చన్న అనుమానాలు ఉండటంతో టె–క్నికల్ ఇంటెలిజెన్స్ బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడితో భారత్– పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.
భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటు–న్నట్లు– తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు– నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి. పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?

అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్‌గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్‌కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని రేవంత్ హెచ్చరించారు. కేసీఆర్ సభకు అవసరమైనన్ని బస్సులు సమకూర్చినప్పటికీ, గతంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వకపోవడం మోసపూరిత చర్య అని మండిపడ్డారు.ఫోన్ ట్యాపింగ్ కేసుల గురించి రేవంత్ మాట్లాడుతూ.. చట్టం మేరకే చర్యలు తీసుకుంటామని, కేసీఆర్ లాగా నేను చట్టాన్ని అతిక్రమించను అని ఆయన అన్నారు. కేటీఆర్ మీద ఉన్న కేసులు కూడా చట్ట ప్రకారమే సాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో తాను చేసిన వ్యాఖ్యలే కేసీఆర్ సభలో పునరావృతం చేశారని



విమర్శించారు. కొంత మంది అధికారుల పని తీరు తెలిసినా, అవసరంగా ఉన్న కారణంగా వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ల మార్పు వేరే విషయమని, అవసరమైన మార్పులు చేసుకుంటామని వివరించారు. నన్ను నమ్ముకున్న వారిని నేను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు. ఓపికగా ఉన్న వారికే తన నుండి బాధ్యతలు వస్తాయని, బయటకి వెళ్లి విమర్శలు చేస్తే తనపై బాధ్యత ఉండదని అన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టుల అంశంపై జానారెడ్డితో చర్చ జరిగినట్లు చెప్పారు. గతంలో మావోయిస్టులతో చర్చలు నిర్వహించిన అనుభవం జానారెడ్డి, కేకేలకు దగ్గర ఉందని, ఇప్పుడు కూడా అదే విధంగా వ్యవహరించేందుకు అధిష్టానం నిర్ణయాన్ని ఎదురుచూస్తున్నామని వెల్లడించారు. పార్టీ హైకమాండ్ కు సమాచారం
ఇచ్చి, పీస్ కమిటీ రిక్వెస్ట్ పంపిస్తామని తెలిపారు. జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.

## తిరుపతి జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం



తిరుపతి: ఆంధ్రప్రదేశ్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. తిరుపతిలో జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో అక్కడిక్కడే ఐదుగురు మృతిచెందారు.. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి.. పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై పాకాల మండలం తోటపల్లి దగ్గర ఘోరు ప్రమాదం చోటు చేసుకుంది.. కం–టైనర్ వాహనం కిందకు దూసుకెళ్లింది కారు.. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు
విడిచారు.. ప్రమాదంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, 9 ఏళ్ల బాలుడు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.. అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు.. ప్రమాదానికి గురైన వాహనం.. తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉండడంతో.. మృతులు కూడా ఆ రాష్ట్రానికి చెందినవారిగానే అనుమానిస్తున్నారు..

## చెత్త సేకరణకు అధిక ప్రాధాన్యం మంత్రి నారాయణ వెల్లడి

విజయవాడ: చెత్త సేకరణకు మున్సిపల్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెపాసిటీ– బిల్డింగ్, బిహేవియరల్ చేంజ్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్ షాప్‌నకు మంత్రి నారాయణ, కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తొలగించడం ఎంతో సవాల్‌తో కూడినదని అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో 6500 టన్నుల సాలిడ్ వేస్ట్ ప్రతి రోజూ వస్తుందని చెప్పారు. ఏరోజు కారోజు ఈ చెత్తనంతా తొలగించాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వం 80 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందని మంత్రి నారాయణ అన్నారు.




## గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరు పోర్టు

మచిలీపట్నం: గేట్ వే ఆఫ్ అమరావతిగా బందరు పోర్టు మారేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మంత్రులు అన్నారు. ఇన్లాండ్ వాటర్ వేస్ అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి నిర్మాణంలో కూడా పోర్టు భాగస్వామిగా మారబోతోందన్నారు. పోర్టు పనులు త్వరగా పూర్తి చేయడం ద్వారా పోర్ట్ బేస్డ్ ఇండస్ట్రీలు కూడా ఎక్కువగా మచిలీపట్నంలో ఏర్పడేందుకు అవకాశాలు ఉంటా యన్నారు. మచిలీపట్నంలో పోర్టు పనులను మంత్రులు కొల్లు రవీంద్ర , బీసీ జనార్దన్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా పోర్టు నిర్మాణ స్థితిని మంత్రులకు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ క్రమంలో సోమవారం మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..
ఇప్పటి వరకు నాలుగు బెర్తుల పనులు, రోడ్డు పనులు, విజయవాడకు అనుసంధానించే పనులు 40 శాతం పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోర్టు పనులపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారని, మరోవైపు బందరులో టూరిజం హబ్ ఏర్పాటు పనులు చేస్తున్నామని, సర్ఫ్యాట్ టూరిజం అభివృద్ధి చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మార్చి 2026 నాటికి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ పూర్తి చేయాలనే లక్ష్యంతో
కాల పరిమితి పొడిగింపు చేశాం అని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయాయని, హార్బర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే ఆలోచనతో దాదాపు రూ.422 కోట్లతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే దాదాపు 57 శాతం పనులు పూర్తయ్యాయి కానీ కీలకమైన పనుల్లో జాప్యం జరిగిందన్నారు.

వేగుచుక్క

# సుపారీ ఇచ్చి భర్త హత్యకు భార్య ప్లాన్.

**ప్రియుడు, గ్యాంగ్ తో కలిసి దాడి.**

**దారిలో వచ్చిన వారిని చూసి పరారైన గ్యాంగ్.**

**గాయాలతో బయటపడ్డ బాధితుడు.**

**వివాహేతర బంధానికి అడ్డొస్తున్నాడని ఘాతుకం.**

**నిందితుల అరెస్ట్**

**వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర.**






**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 28:**

వివాహేతర సంబంధాలు శృతి మించిపోయి కట్టుకున్నవారినే సుపారీ ఇచ్చి హత్యలు చేస్తున్న నీచ సంస్కృతి రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. దీనికి మాచారెడ్డి మండలంలో జరిగిన ఘటనే నిదర్శనం.

వివాహేతర సంబంధానికి అడ్డస్తున్నాడని భర్తను సుపారీ ఇచ్చి హత్య చేసేందుకు కుట్ర పన్నిన భార్యను, మిగతా 5గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహిహించిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్పీ వెల్లడించారు. మాచారెడ్డి మండల పరిధిలోని ఫరీద్ పేట గ్రామ శివారులో మోటార్ సైకిల్ పై డ్యూటీకి వెళ్తున్న ఘనపురం గ్రామానికి చెందిన సాడెం కుమార్ అనే యువకుడిని ఈ నెల 21న ఇనుపరాడ్లతో దాడి చేసి హత్యాయత్నం చేశారని తెలిపారు.

బాధితుడు మాచారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కామారెడ్డి ఏఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. వేగవంతంగా దర్యాప్తు చేసిన పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి చేశారు. నిందితుల్లో ఫిర్యాదుదారుడి భార్య సాడెం రేణుక కూడా ఉంది. తుది విచారణలో వివాహేతర సంబంధం నేపథ్యంలో రేణుకు తన భర్త హత్యకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చిందని ఎస్పీ వివరించారు.

**పూజారితో ప్రేమ...**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు కాంపల్లి మహేష్ రాజన్న సిరిసిల్లా జిల్లా, తంగళ్ల పల్లి గ్రామ సమీపంలోని లలితమ్మ దేవాలయంలో పూజారిగా పని చేస్తున్నారని తెలిపారు. అక్కడే ఘనపురం గ్రామానికి చెందిన సాడెం రేణుకతో పరిచయం ఏర్పడి, వారిద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసిందన్నారు. రేణుక భర్త కుమార్ తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి, ఇద్దరూ కలిసి కుమార్ ను హత్య చేయాలని కుట్ర పన్నారని తెలిపారు. కుమార్ మరణించిన తరువాత అతని ఆస్తిని అనుభవించాలని ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కుట్రను అమలు చేయడానికి అల్వాల్ కు చెందిన మహమ్మద్ అశ్వాక్ కు రూ.15లక్షలకు సుపారీకి ఒప్పించి, అతని అనుచరులైన ముబిన్, అమీర్, అన్వర్, మోసిన్లకు అడ్వాన్స్ గా రూ.2లక్షలు ఇచ్చారు. వారి పథకం ప్రకారం కుమార్ కార్యాలయానికి వెళ్లే మార్గాన్ని గుర్తించి మాచారెడ్డి మండల పరిధిలోని ఫరీద్ పేట గ్రామ సమీపంలోని సోలార్ ప్లాంట్ వద్దకు హత్యకు అనువైన ప్రదేశంగ ఎంచుకున్నరు. దీంతో ఈనెల 21న ఉదయం కాంపల్లి మహేష్, అశ్వాక్, అతని అనుచరులు కుమార్ ను వెంబడించి ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు రావడం గమనించిన నిందితులు అక్కడి నుండి పరారయ్యారని పోలీసులు విచారణలో తేల్చారు. దీనితో నిందితులు ఐదు గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి కారు, ఆటో, గొడ్డలి, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్నమిగతా వారిని త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదిండంలో కృషి చేసిన కామారెడ్డి రూరల్ సీఐ ఎస్. రామన్, మాచారెడ్డి ఎస్ఐ వై. అనిల్, క్రైం టీం సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# గాంధీ విగ్రహానికి పార్ట్ టైం అధ్యాపకుల వినతి.



**వేగుచుక్క న్యూస్, బిక్నూర్, ఏప్రిల్ 28:**

తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో పార్ట్ టైం అధ్యాపకులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి ఏడవ రోజు కు చేరింది. సమ్మెలో భాగంగా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, గాంధీ దృష్టిలో విద్య అనేది సమానత్వం సాధించడానికి ఒక సాధనమని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గాంధీ అభిప్రాయపడ్డారనీ అన్నారు. విశ్వవిద్యాలయాలలో పనిచేసే అధ్యాపకుల విద్య దేశాభివృద్ధికి తోడ్పడుతుందనీ, అలాంటి విశ్వవిద్యాలయాలలో నేడు పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇప్పటివరకు కనీస వేతనం కూడా లేదని, జి.ఓ 21 ని సవరించి తమ సర్వీసులను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇకనైనా పార్ట్ టైం అధ్యాపకుల న్యాయపరమైన డిమాండ్లను గుర్తించి తమకు న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.



# సిద్దాపూర్‌కు

## రూ" 50 లక్షల నిధులు మంజూరు.

**- వినయ్ రెడ్డికి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఏప్రిల్ 28**

నందిపేట్ మండలం సిద్దాపూర్ గ్రామ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి దేవాదాయ శాఖా నుండి నిధులు కావాలని కోరగా, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావుని సంప్రదించగా దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ తో మాట్లాడి యాభై లక్షల రూపాయలు నిధులను మంజూరి చేస్తూ విడుదల చేసిన జీఓ లేఖ నీ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలకు అందించారు.నిధులను మంజూరు చేపించినందుకు వినయ్ రెడ్డికి, మంత్రి సురేఖ, జూపల్లికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# కళ్లుచేదిరేలా కాళేశ్వరం హరిరామ్ అక్రమాస్తులు..

**తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీగా పని చేసిన భూక్యా హరిరామ్ అక్రమాస్తుల లెక్క తేలుతోంది. 14 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించగా.. దాదాపు రూ.300 కోట్ల అక్రమ ఆస్తులను గుర్తించారు. షేక్‌పేట, కొండాపూర్, మాదాపూర్‌తో పాటుగా.. ఏపీ రాజధాని అమరావతిలోనూ అక్రమాస్తులు గుర్తించారు. హరిరామ్ బ్యాంక్ లాకర్లు తెరవడానికి ఏసీబీ కోర్టు అనుమతి కోరనుంది.

కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని ప్రభుత్వం ఆరోపిస్తున్న సంగతి తెలిసందే. ఇటీవల నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ ప్రాజెక్టుపై నివేదిక విడుదల చేసింది. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంజనీర్-ఇన్-చీఫ్ గా పని చేసిన భూక్యా హరిరామ్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు జరగడానికి, భారీ అవినీతికి హరిరామ్ ముఖ్య పాత్ర పోషించారనే ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ అధికారులు హరిరామ్, ఆయన బంధువులకు సంబంధిం చిన దాదాపు 14 ప్రాంతాల్లో ఇటీవల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు రూ. 300 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు సమాచారం. వీటిలో విల్లాలు, ఫ్లాట్లు, వాణిజ్య స్థలాలు, వ్యవసాయ భూములు, ఇతర ఆస్తులు ఉన్నాయి. సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా వాటిని ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం అంచనా వేస్తున్నారు. హరిరామ్ భార్య అనిత కూడా అక్రమాస్తుల కేసులో ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఆమెపై ప్రత్యేకంగా కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

సోదాల్లో భాగంగా షేక్‌పేట, కొండాపూర్‌లో విల్లాలు, మాదాపూర్, నార్సింగిలో ఫ్లాట్లు, ఏపీ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం, మర్కుక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో భూములు, శ్రీనగర్ కాలనీలో ఇండ్లు, బొమ్మలరామారంలో మామిడి తోట, ఫామ్‌హౌస్, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం తదితర ఆస్తులను గుర్తించారు. మూడు బ్యాంక్ లాకర్లు కూడా గుర్తించారు. కొన్ని ఆస్తులు బినామీల పేర్లపై ఉన్నట్లు తేలింది. ఇప్పటివరకు నలుగురు బినామీల వివరాలను ఏసీబీ సేకరించగా.. మిగతావారి వివరాల కోసం దర్యాప్తు కొనసాగుతోంది. జలసౌధ కార్యాలయం, హరిరామ్ ఇంట్లో లభించిన డాక్యుమెంట్లను ఒక ప్రత్యేక బృందం పరిశీలిస్తోంది. ఇక హరిరామ్‌ను ఆదివారం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపరచగా.. న్యాయ మూర్తి ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

# రాజీవ్ యువ వికాసం పథకం.. దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు..




**తెలంగాణ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా మొదటి రెండు కేటగిరీల రుణాలకు స్పందన తక్కువగా ఉండటంతో.. ఈ కేటగిరీల కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరనుంది. అయితే.. రూ.4 లక్షల విలువైన యూనిట్ల కోసం మాత్రం అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. తక్కువ దరఖాస్తులు వచ్చిన కేటగిరీల నిధులను ఇతర కేటగిరీలకు మళ్లించే యోచనలో ప్రభుత్వం ఉంది. అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఆన్‌లైన్ డేటాబేస్ ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని సంక్షేమ శాఖ నిర్ణయించింది.

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి పొందాలనుకుంటున్న యువతకు తెలంగాణ ప్రభుత్వం చేయూతనిస్తోంది. ఈ పథకం కింద వివిధ కేటగిరీల వారీగా రుణ సహాయం అందించ డానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే.. ప్రారంభ దశలో కేటగిరీ-1, కేటగిరీ-2 కింద రుణాల మంజూరుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రెండు కేటగిరీల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కంటే తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఈ కేటగిరీల కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ నూరు శాతం లబ్ధి చేకూరనుంది.

కేటగిరీ-1 కింద ఎంపికైన లబ్ధిదారులకు పూర్తిగా రాయితీతో రూ.50 వేల విలువైన యూనిట్లను మంజూరు చేయనున్నారు. అదేవిధంగా.. కేటగిరీ-2 కింద 90 శాతం రాయితీతో రూ.లక్ష విలువైన యూనిట్లను అందించనున్నారు. ఈ పథకం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన మొత్తం 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కేవలం 1.32 లక్షల దరఖాస్తులు మాత్రమే కేటగిరీ-1 మరియు 2 కింద వచ్చాయి. వాస్తవానికి.. ఈ రెండు కేటగిరీల కింద 2.8 లక్షల మందికి సహాయం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు సంబంధించిన అనుమతులు కూడా మంజూరు చేసింది. కానీ.. వచ్చిన దరఖాస్తుల సంఖ్య లక్ష్యంలో సగానికి కూడా చేరకపోవడం గమనార్హం.

ఎస్టీ కార్పొరేషన్ పరిధిలో అయితే పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. రెండు కేటగిరీల కింద దాదాపు 62 వేల మందికి లబ్ధి చేకూర్చాలని భావిస్తే.. కేవలం 4 వేల మంది కూడా దరఖాస్తు చేయలేదు. ఈబీసీ కేటగిరీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. 33 వేల మందికి సహాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. కేవలం 2,500 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

మొత్తంగా చూసుకుంటే.. అన్ని సంక్షేమ కార్పొరేషన్ల పరిధిలో కేటగిరీ-1 , 2 కింద నిర్ణయించిన లక్ష్యంలో సగం దరఖాస్తులు కూడా రాకపోవడం ప్రభుత్వ అధికారులను ఆలోచనలో పడేసింది. దీంతో ఈ కేటగిరీల కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ వెంటనే రుణాలు మంజూరు చేసి.. మిగిలిన నిధులను కేటగిరీ-3, 4 రుణాల కింద సర్దుబాటు చేయాలని సంక్షేమ కార్పొరేషన్లు యోచిస్తున్నాయి.

యువ వికాసం పథకం కింద రూ.4 లక్షల విలువైన యూనిట్ల కోసం మాత్రం అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల్లో దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండగా.. పట్టణాల్లో మాత్రం తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో.. ప్రజాపాలన కేంద్రాల్లో ఇంకా పూర్తి చేయని దరఖాస్తులు ఉన్నప్పటికీ.. ఆన్‌లైన్‌లో ఉన్న డేటాబేస్ ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులు నిర్ణయించారు. దీని ద్వారా అర్హులైన లబ్ధిదారులను త్వరగా గుర్తించి వారికి సహాయం

రాజీవ్ యువ వికాసం పథకం కింద మొదటి రెండు కేటగిరీల రుణాలకు తక్కువ దరఖాస్తులు రావడంతో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల నుండి 16.23 లక్షల దరఖాస్తులు రాగా.. మొదటి రెండు కేటగిరీల కింద లక్ష్యం కంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. రూ.4 లక్షల విలువైన యూనిట్ల కోసం అధిక దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ డేటాబేస్ ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి.

# పీవీ ఎక్స్‌ప్రెస్‌వే మీద కారు ప్రమాదం..!



**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై జరిగిన ఘోర ప్రమాదం జరిగింది. ఒక కారు అతివేగంగా వచ్చి ముందువెళ్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ఫ్లైఓవర్ అంచున ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన కారణంగా ఫ్లైఓవర్ మీద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

జస్ట్ మిస్.. వెంట్రుకవాసిలో ఘోర ప్రమాదమే తప్పింది. చావు అంచుల వరకు వెళ్లి.. ఎవరో తాడేసి పైకి లాగినట్టు.. ఏమీ కాకుండా తిరిగి రావటమంటే ఇదేనేమో. భూమ్మీద నూకలు మిగేలే ఉన్నాయనాలో.. లేచిన ఘడియ బాగుందనాలో.. కారు ఎడ్జ్‌లో ఆగిపోయింది కాబట్టి ఏం కాలేదు.. లేకుంటేనా అంతెత్తు ఉన్న ఫ్లైఓవర్ నుంచి కింద పడితే.. ఇంకేమైనా ఉందా.. కారు మొత్తం తుక్కుతుక్కు అయ్యేది. కారు గురించి పక్కన పెట్టండి.. అందులో ఉన్న ప్రయాణికుల పరిస్థితి ఏంటీ..? అక్కడితో అయిపోయిందా.. అదే సమయంలో ఫ్లైఓవర్ కింద రోడ్డుపై ప్రశాంతంగా వెళ్తున్న వాహనాలపై గనక ఆ కారు పడి ఉంటే.. వాళ్ల పరిస్థితి ఎలా ఉండేది..? ఆ బీతావహ దృశ్యాలు ఊహించుకుంటేనే.. ఒళ్లు గగుర్పొడుస్తోంది. జస్ట్ ఎడ్జ్‌లో కారు ఆగిపోయింది కాబట్టి ఎలాంటి ఘోరం జరగలేదు. ఈ ప్రమాదం ఎక్కడో కాదు.. హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే మీద జరిగింది.

సాదారణంగానే పీవీ ఎక్స్‌ప్రెస్ వే మీద వాహనాలు మాంచి స్పీడ్‌తో దూసుకెళ్తుంటాయి. అలాగే ఓ కారు అతివేగంతో దూసుకెళ్తోంది. దాని దారిలో అది వెళ్తే ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ.. ఓవర్ స్పీడ్‌తో దూసుకొచ్చిన ఆ కారు.. ముందువెళ్తున్న మరో కారును వెనక నుంచి ఎడ్జ్‌లో ఢీకొట్టటంతో.. సినిమాల్లో చూపించినట్టుగా కారు ఢీకొట్టటంతోనే ముందు వెళ్తున్న కారు ఓవైపు పూర్తిగా పల్టీ కొట్టి చాలా దూరం దూసుకెళ్లింది. అది కూడా ఫ్లైఓవర్ అంచున నిర్మించి ఉన్న సిమెంట్ రెయిలింగ్ వెంబడే. అక్కడ సిమెంట్ రెయిలింగ్ ఉండటంతో సరిపోయింది కానీ.. లేకపోతేనా చాలా పెద్ద ప్రమాదమే జరిగిఉండేది. కారు.. అలా పూర్తిగా ఒకపక్కగా ఒరిగి.. దాని వెనుక భాగం ఢీకొట్టిన కారు ముందుభాగంపై నిలిచి ఉండటాన్ని చూస్తుంటే.. భారీ ప్రమాదం వెంట్రుక వాసిలో తప్పినట్టుగా అర్థమవుతోంది. ఈ ప్రమాదాన్ని కళ్లారా చూసిన వాళ్ల గుండెలు ఒక్క క్షణం ఆగినంతపనై ఉంటుంది.



# మామిడి రైతులకు తీపి కబురు.. సర్కార్ కీలక నిర్ణయం...

**తెలంగాణ:** తెలంగాణ మామిడి రైతులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రంలో పండించే మామిడి పండ్లను శుద్ధి చేసి 'తెలంగాణ బ్రాండ్' పేరుతో నేరుగా విదేశాలకు ఎగుమతించే మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఉద్యానశాఖ రూ.35 కోట్లు కేటాయించింది. ఈ నిర్ణయం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు లాభం చేకూరనుంది. బాటసింగారం, కోహెడ వంటి ప్రాంతాల్లో ఆధునిక ప్యాక్‌హౌస్‌లు ఏర్పాటు చేయనున్నారు.

తెలంగాణ మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో పండించే మామిడి పండ్లను శుద్ధి చేసి, తెలంగాణ బ్రాండ్ పేరుతో రైతులే నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉద్యానశాఖ రూ.35 కోట్లతో సమగ్ర ప్రతిపాదనలు రూపొందించింది. తెలంగాణ మామిడికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంలో ఏటా సుమారు ఆరు వేల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతుండగా.. అందులో వెయ్యి టన్నుల వరకు ప్రైవేటు కంపెనీల ద్వారా ముంబై, బెంగళూరుల మీదుగా విదేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ క్రమంలో మధ్యవర్తులు లాభాలు గడిస్తుండటంతో, రైతులకు సరైన ఆదాయం అందడం లేదు.

ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఎగుమతులకు అవసరమైన అత్యాధునిక శుద్ధి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. దీనిలో భాగంగా, మామిడిపై ఉండే పురుగులను తొలగించే రేడియేషన్ ప్రక్రియ కోసం రూ.24 కోట్లతో అటామిక్ రీసెర్చ్ ఎనర్జీ యంత్రం, పండ్లను మెరిసేలా చేసే వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.5 కోట్లు, మామిడిని మగ్గబెట్టే హాట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు రూ.3 కోట్లు, నిల్వ కోసం కోల్డ్ రూమ్స్‌కు రూ.4 కోట్లు మరియు ఇంటిగ్రేటెడ్ ప్యాకింగ్ కోసం రూ.2 కోట్లు కేటాయించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బాటసింగారం పండ్ల మార్కెట్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్‌లను ఏర్పాటు చేస్తారు. భవిష్యత్తులో కోహెడ అంతర్జాతీయ మార్కెట్ ప్రారంభమయ్యాక అక్కడ కూడా పదికి పైగా అత్యాధునిక ప్యాక్‌హౌస్‌లను నెలకొల్పాలని ఉద్యానశాఖ యోచిస్తోంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ మామిడి రైతులు నేరుగా అంతర్జాతీయ మార్కెట్‌లోకి ప్రవేశించి అధిక లాభాలు పొందడానికి అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా, తెలంగాణ మామిడి బ్రాండ్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని లక్షలాది మామిడి రైతులకు నిజంగా ఒక తీపి కబురు. తెలంగాణలో ప్రధానంగా హిమాయత్, బంగినపల్లి, దశేరి వంటి రకాలు పండుతాయి. వీటికి అంతర్జాతీయ మార్కెట్ లో మంచి గిరాకీ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతులకు అండగా నిలుస్తోంది. తాజాగా నిర్ణయం వారి ఆదాయాన్ని మరింత పెంచనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. ప్యాక్‌హౌస్‌లలో, ఎగుమతి ప్రక్రియలో అనేక మందికి ఉపాధి దొరకనుంది.

వేగుచుక్క

# ఆ సినిమాలోని కొన్ని సీన్స్‌లో నా యాక్టింగ్ నచ్చలేదు..: నాని



నాని, విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎవడే సుబ్రమణ్యం'. నాగ్ అశ్విన్ దర్శకుడు. ఈ సినిమా విడుదలై 10 ఏళ్లైన సందర్భంగా ఇటీవల టీమ్ రీయూనియన్ నిర్వహించింది. నటీనటుల, దర్శక-నిర్మాతలతో పాటు సినిమా కోసం వర్క్ చేసిన టీమ్ అందరూ కలిశారు. ఈ రీ యూనియన్‌ని ఉద్దేశించి నాని తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పదేళ్ల తర్వాత టీమ్ అందరినీ కలుసుకోవడం ఎమోషనల్‌గా అనిపించిందన్నారు.

"విజయ్, నేను, నాగ్ అశ్విన్ ఇప్పటికీ టచ్‌లోనే ఉన్నాం. వీలున్నప్పుడు మాట్లాడుకుంటాం. సినిమాలు విడుదలైనప్పుడు సందేశాలు పంపించుకుంటాం. పదేళ్ల తర్వాత టీమ్ అంతా ఒకేచోట కలవడం ఆనందంగా అనిపించింది. స్కూల్ రీయూనియన్‌లా అనిపించింది. మా సినిమా కోసం వర్క్ చేసిన వాళ్లు చాలా మంది పెద్దవాళ్లు అయ్యారు. రీ యూనియన్‌లో సినిమా ప్రదర్శించారు. అందులోని కొన్ని సీన్స్ చూసినప్పుడు నా యాక్టింగ్ బాలేదనిపించింది. ఇంకాస్త బెటర్‌గా చేస్తే బాగుండేదనే ఫీలింగ్ వచ్చింది" అని నాని చెప్పారు.


# ఆ సమయంలో జీవితపాఠం నేర్చుకున్నా



కమల్‌హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటి శ్రుతి హాసన్. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడించారు. ఇండస్ట్రీకి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు.

"నేను ఇండస్ట్రీకి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్‌లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండస్ట్రీకి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను" అని చెప్పారు. శ్రుతిహాసన్ తల్లిదండ్రులు కమల్ హాసన్, సారిక 2004లో విడిపోయిన సంగతి తెలిసిందే.

# 'డాకు మహారాజ్'.. ఆ విషయంలో నెట్‌ఫ్లిక్స్ సారీ చెప్పింది




బాలకృష్ణ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం 'డాకు మహారాజ్'. ఇందులో నటించి ప్రేక్షకులను అలరించారు బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా. ఈ సినిమా ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన పోస్టర్‌పై ఊర్వశీ రౌతేలా ఫొటో లేకపోవడం అప్పట్లో చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా ఊర్వశీ రౌతేలా స్పందించారు. ఈ విషయంలో నెట్‌ఫ్లిక్స్ తమ టీమ్‌కు సారీ చెప్పిందన్నారు. "ఒరిజినల్ రిలీజ్ పోస్టర్‌లో ఉన్న నా ఫొటోని తొలగించి నెట్‌ఫ్లిక్స్ అదే పోస్టర్ షేర్ చేసింది. నెట్‌ఫ్లిక్స్ కావాలనే అలా చేసిందని అందరూ అనుకున్నారు. అందులో ఎలాంటి నిజం లేదు. నెట్‌ఫ్లిక్స్ కావాలని ఇలాంటి నిర్ణయం తీసుకోలేదు. అది ఉద్దేశపూర్వకంగా ఆ పోస్టర్ షేర్ చేయలేదు. అనుకోకుండా జరిగింది. ఆ ఓటీటీ సంస్థ తప్పు గ్రహించి.. మాకు సారీ చెప్పింది. ఆ తర్వాత నా ఫొటోలతో ఉన్న కొత్త పోస్టర్లను షేర్ చేసింది. కాకపోతే, తొలిసారి షేర్ చేసిన పోస్టర్‌లో నా ఫొటో లేకపోవడంపై అభిమానులు ఆగ్రహానికి గురయ్యారు" అని ఆమె వెల్లడించారు.

# హీరోయిన్స్ ఎప్పటికీ స్నేహితులు కాలేరు..



నాలుగు సీన్స్ కోసం స్క్రీన్‌పై కనిపించడం కంటే ఆంటీ లేదా అమ్మ పాత్రల్లో నటించడమే ఉత్తమమంటూ నటి సిమ్రన్ చేసిన వ్యాఖ్యలు అంతటా తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయా కామెంట్స్‌ను ఉద్దేశించి ఆమె తాజాగా మరోసారి క్లారిటీ ఇచ్చారు.

"నా తోటి నటి చేసిన కామెంట్స్ నన్నెంతో బాధించాయి. ఆ బాధతోనే ఇటీవల జరిగిన అవార్డుల కార్యక్రమంలో నాకు అనిపించింది చెప్పాను. కెరీర్ ఆరంభం నుంచి అడపాదడపా ఆంటీ రోల్స్‌లో యాక్ట్ చేస్తున్నా. అలా యాక్ట్ చేయడంలో తప్పేముంది. ఆ రోల్స్ నాకు ఇష్టమే. నిజం చెప్పాలంటే ఇండస్ట్రీలో ఉండే హీరోయిన్స్ ఎప్పటికీ స్నేహితులు కాలేరు. నాకు ఎదురైన అనుభవంతో అది మరోసారి నిరూపితమైంది. స్నేహితులనుకున్నవాళ్లు కొన్ని సందర్భాల్లో తమ కామెంట్స్‌తో మనల్ని ఎంతో బాధిస్తారు. ఆ అవార్డుల కార్యక్రమం తర్వాత ఆ నటి నాకు మరోసారి ఫోన్ చేసింది. నేను ఏమీ ఇబ్బందిపడలేదు కానీ, ఆమెతో అంతకుముందు ఉన్న రిలేషన్ ఇప్పుడు లేదు" అని సిమ్రన్ తెలిపారు.

# నాగచైతన్య 24వ మూవీ.. మైథలాజికల్ థ్రిల్లర్



నాగచైతన్య కథానాయకుడిగా కార్తిక్ దండుతో దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లింది. నాగచైతన్య 24వ చిత్రంగా రాబోతున్న ఈ మూవీకి సంబంధించిన స్పెషల్ వీడియోను విడుదల చేశారు. NC24 సినిమా కోసం ఎలా సిద్ధమయ్యారు? ఎలాంటి సెట్స్/మినీయేచర్స్ వేశారు? నాగచైతన్య లుక్ సహా అనేక విషయాలను ఇందులో చూపించారు. ఆద్యంతం ఆకట్టుకునే ఎలిమెంట్స్‌తో తీర్చిదిద్దిన వీడియో సినిమాపై అంచనాలను పెంచింది. ఇప్పటివరకూ తెలుగు తెరపై చూడని సరికొత్త మైథలాజికల్ థ్రిల్లర్‌గా కార్తిక్ దండు దీన్ని తీర్చిదిద్దనున్నారు.

# పహల్గాం విషాదం.. షో క్యాన్సిల్ చేసిన శ్రేయాఘోషల్



పహల్గాం విషాదం దేశవ్యాప్తంగా ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన విషయం తెలిసిందే. ఉగ్రదాడి అనంతరం అంతటా పరిస్థితులు తీవ్ర ఉత్కంఠగా మారాయి. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోనే ప్రముఖ గాయనీ గాయకులు తమ కాన్సర్ట్స్‌ను రద్దు చేసుకుంటున్నారు. ఇప్పటికే గాయకుడు అర్జిత్ సింగ్ ఏప్రిల్ 27న చెన్నైలో జరగాల్సిన తన షో రద్దు చేసుకున్నారు. ఇప్పుడిదే కోవలో గాయని శ్రేయాఘోషల్ సైతం తన కాన్సర్ట్ రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈరోజు సాయంత్రం సూరత్ వేదికగా జరగాల్సిన తన షోను క్యాన్సిల్ చేసుకుంటున్నానని ఆమె చెప్పారు. ఇప్పటికే టికెట్లు కొనుగోలు చేసిన వారికి డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని ఆమె వెల్లడించారు."పహల్గాం విషాదం, ఆ తర్వాత చోటుచేసుకున్న పలు పరిస్థితుల నేపథ్యంలో సూరత్‌లో జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేయాలని మేమంతా భావించాం. ఇప్పటికే టికెట్లు కొనుగోలు చేసిన వారికి డబ్బు తిరిగి ఇచ్చేస్తాం. పరిస్థితులను అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం" అని షో నిర్వాహకులు ప్రకటించారు.

# అలాంటి సినిమాలకు వచ్చే విమర్శలు ఎంతో బాధిస్తాయి: అక్షయ్ కుమార్



ఇటీవల 'కేసరి: ఛాప్టర్ 2', 'స్కై ఫోర్స్'లతో రెండు విజయాలు అందుకున్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. ఈ సినిమాలు కమర్షియల్‌గా హిట్ కాకపోయినప్పటికీ విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్షయ్ ప్రేక్షకుల నుంచి వచ్చే ప్రశంసలు, విమర్శల గురించి మాట్లాడారు.

"సినిమాకు ప్రేక్షకులే బాస్. వాళ్లు చప్పట్లు కొట్టినప్పుడు ప్రేరణ పొందుతాను. విమర్శించినప్పుడు తప్పు తెలుసుకొని నేర్చుకుంటాను. ఎప్పుడూ నా నటనను ఎలా మెరుగుపరుచుకోవాలా అనే ఆలోచిస్తాను. వాళ్ల విమర్శలు నాకు నిజమనిపిస్తే ఎప్పుడూ నిందించను. అది స్క్రిప్ట్, పాత్రల ఎంపిక దేన్నైనా విమర్శించే హక్కు వాళ్లకు ఉంటుంది. భిన్నంగా ప్రయత్నించమని ఎన్నోసార్లు చెప్పారు. అందుకే నేను వైవిధ్యమైన కథలను ఎంచుకుంటున్నాను. అలాంటి సినిమాలు చేస్తున్నప్పటికీ కొందరు విమర్శిస్తుంటే మాత్రం బాధ పడతాను".

"నెలసరి సమయంలో మహిళల బాధలను ప్రపంచానికి చూపుతూ 'ప్యాడ్ మ్యాన్' చేశాను. అలాగే సెక్స్ ఎడ్యుకేషన్ గురించి 'ఓ మైగాడ్ 2' తీశాను. గ్రామీణ ప్రాంతాల్లోని మరుగుదొడ్ల కొరతను ఎత్తి చూపుతూ 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ' అనే చిత్రాన్ని చేశాను. ఇది చూశాక ఎంతోమంది వారి ఇళ్లల్లో టాయిలెట్‌లను నిర్మించుకొన్నారు. అలాగే తాజాగా జలియన్‌వాలాబాగ్ మారణకాండ నేపథ్యంపై 'కేసరి: ఛాప్టర్ 2' అందించాను. ఇవన్నీ నాకు ఒక నటుడిగా ఎంతో సంతృప్తినిచ్చాయి. కానీ.. వీటిపై వచ్చే విమర్శలు నన్ను బాధిస్తాయి." అని చెప్పారు.